మన్యం రహదారులకు మోక్షం!

రూ.13.55 కోట్ల అంచనాతో నిర్మాణానికి అనుమతులు

రహదారి	కిలోమీటర్లు	అంచనా విలువ (రూ.లక్షల్లో)
పందిరిమామిడిగూడెం నుంచి ఇనుమూరు	1.70	91
బొత్తప్పగూడెం వద్ద జాతీయ రహదారి అడ్డరోడ్డు నుంచి దండిపూడి	5.30	281.50
దొరమామిడి నుంచి వీరమద్దిగూడెం	4.90	265
లంకపాకల మార్గం నుంచి రేగులపాడు	3.80	350
గురుగుమిల్లి నుంచి చింతకొండ, గొట్టాలరేవు మీదగా పూచికగొంది	6.30	368


గొట్టాలరేవు రహదారి దుస్థితి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అధ్వాన దుస్థితిలో ఉన్న మన్యంలోని మారుమూల గ్రామాల రహదారులకు మోక్షం కలగనుంది. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద తొలి విడత రూ.13.55 కోట్ల అంచనాతో బుట్టాయగూడెం మండలంలో అయిదు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులిచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి లభించిన గ్రామాల పరిధిలో 22 కిలోమీటర్ల మేర తారురోడ్లు నిర్మించనున్నారు. ఆ పనులకు కేంద్ర ప్రభుత్వం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించి వెచ్చిస్తాయి. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఈ పనులు చేపడతారు. 'పరిపాలనా అనుమతులు లభించిన పనుల ప్రతిపాదనల నివేదికలను ప్రభుత్వానికి అందజేశాం. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడతాం' అని పంచాయతీరాజ్ శాఖ పీఐయూ విభాగపు జంగారెడ్డిగూడెం డీఈ కె.బాలకృష్ణ తెలిపారు.

ట్రైకార్ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసులును అభినందిస్తున్న ఎంపీ మహేశ్‌కుమార్ తదితరులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ట్రైకార్ ఛైర్మన్‌గా తెదేపా పోలవరం నియోజకవర్గ కన్వీనరు బొరగం శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, దెందులూరు, పోలవరం శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, చిర్రి బాలరాజు, తెదేపా ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రి పీతల సుజాత, పోలవరం ఏఎంసీ మాజీ అధ్యక్షుడు పారేపల్లి రామారావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. బొరగం ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని పోలవరం నియోజకవర్గం నుంచి తెదేపా, జనసేన శ్రేణులు విజయవాడ తరలివెళ్లాయి.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగమవుదాం: మంత్రి



మాట్లాడుతున్న పార్థసారథి, చిత్రంలో కామినేని, ధాత్రిరెడ్డి, పద్మశ్రీ, చంటి, ధర్మరాజు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. 'స్వర్ణాంధ్ర@2047 విజన్' దార్శనిక పత్రం రూపకల్పనలో భాగంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం 2047 విజన్‌ను అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోందన్నారు. విజన్ పత్రం అనేది ఆర్థికాభివృద్ధి, సామాజికాభివృద్ధి, పర్యావరణ, సుస్థిరతలపై దృష్టి సారిస్తూ 2047 నాటికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ వృద్ధి కేంద్రంగా మార్చడానికి కావాల్సిన ప్రణాళిక, కార్యాచరణను నిర్దేశిస్తుందన్నారు. ఈ పత్రాన్ని నవంబరు 1న విడుదల చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఏలూరు, కైకలూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు మాట్లాడారు. జిల్లా అభివృద్ధిని వేగవంతం చేసి అభివృద్ధి చెందిన జిల్లాగా రూపొందించడానికి సూచనలు చేశారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఎఫ్‌వో రవీంద్రదామా, ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి, ఆర్డీవోలు కె.అద్దయ్య, అచ్యుత అంబరీశ్, ఎం.వాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అందరూ సూచనలివ్వాలి... ఆంధ్రప్రదేశ్‌ను పేదరిక రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపొందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందిస్తున్న 'స్వర్ణాంధ్ర@2047 విజన్' డాక్యుమెంట్‌కు అందరూ సూచనలివ్వాలని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర-2047 క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, అందులో పేర్కొన్న అభివృద్ధి సూచిక అంశాల్లో ప్రజలు అభిప్రాయాలు చెప్పొచ్చన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జల్‌జీవన్ మిషన్ తదితర ఎన్నో పథకాలను కేంద్రం అమలు చేస్తుండగా.. వాటికి రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్లను గత వైకాపా ప్రభుత్వం ఇవ్వకపోడంతో కేంద్రం నిధులు నిలిచిపోయాయన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్‌ను బాగా రూపొందించారని అధికారులను అభినందించారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు ?

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే-నూజివీడు పట్టణం

వైకాపా అయిదేళ్ల పాలనలో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్లక్ష్యం గూడుకట్టుకుంది. నాయకులకు లబ్ధి చేకూర్చేందుకు కొందరు అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. మనల్ని అడిగేదెవరు ఆపేదెవరు అన్నట్లు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ సొమ్ము నాయకుల పాలు చేశారు.



అద్దె పేరిట లక్షలు పోశారు

ఇది ట్రిపుల్ ఐటీలో మరమ్మతులకు గురైన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్. గత నాలుగేళ్ల నుంచి ఇక్కడే ఉంది. అధికారులు మాత్రం కొత్తది కొనుగోలు చేయకుండా అద్దె ప్రాతిపదికన మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి నెలకు రూ.80 వేల చొప్పున ఇప్పటి వరకు రూ.38.4 లక్షల వరకు అద్దె చెల్లించారు. భవిష్యత్తులోనూ చెల్లిస్తారు. రూ.30 లక్షలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వస్తున్నా అధికారులు కొనుగోలు చేయలేదు. దీంతో అద్దె రూపంలో రూ.లక్షల ప్రభుత్వ సొమ్ము వృథా అవుతోంది.

డ్రెయినేజీ వ్యవస్థకు అడ్డు

2008లో నూజివీడులో ట్రిపుల్ ఐటీ ప్రారంభించారు. ఇక్కడే శ్రీకాకుళం ప్రాంగణం కూడా ఉంటుంది. మొత్తం మీద 7వేల మంది పైగా విద్యార్థులుంటారు. అధ్యాపకులు సైతం అక్కడే నివాసం ఉంటారు. ఇంత వ్యవస్థ ఉన్నా డ్రెయినేజీ సదుపాయం మాత్రం లేదు. పురపాలక సంస్థ నిర్వహిస్తున్న పట్టణ డ్రెయినేజీలోకి అనుసంధానం చేసేందుకు రూ.2.8 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకుండా ఓ వైకాపా నేత గత అయిదేళ్లుగా కాళ్లడ్డు పెడుతూనే ఉన్నారు.

రూ.కోట్ల కుంభకోణం


ట్రిపుల్‌ఐటీలో ఎస్టీపీ ప్లాంట్

⇨ డ్రెయినేజీ నిర్వహణ ముసుగులో మంత్రాంగం
⇨ వైకాపా నేతలకు భారీగా లబ్ధి

గత 16 ఏళ్లుగా డ్రెయినేజీ నిర్వహణకు టెండరు ద్వారా గుత్తేదారులను ఎంపిక చేస్తున్నారు. ఎస్టీపీ ట్యాంకులో ఉన్న డ్రెయినేజీ వ్యర్థాలను బయటికి తరలిస్తున్నారు. దీన్ని స్థానిక వైకాపా నేత కొంగు బంగారంలా మార్చుకున్నారు. తనకు అనుకూలమైన వారికి కాంట్రాక్టు కట్టబెట్టించి నెలకు రూ.లక్షల్లో కమీషన్లు కొట్టేశారు. డ్రెయినేజీని పురపాలికలో అనుసంధానం చేస్తే మెక్కేందుకు అవకాశం ఉండదు. అందుకే ఆ ప్రక్రియ ముందుకు వెళ్లనివ్వలేదు. గత వైకాపా పాలనలో 7 సార్లు టెండర్లు పిలిచినా ఎవర్నీ రాకుండా వ్యవహారం నడిపించారు. ఇప్పటి వరకు కేవలం డ్రెయినేజీ నిర్వహణకు రూ.20 కోట్లకు పైగా గుత్తేదారులకు చెల్లించారు. రూ.2.8 కోట్లతో పూర్తయ్యే పని చేయక పోవటంతో రూ.20 కోట్లు పక్కదారి పట్టాయి.



తలుపులే తీయలేదు

న్యాక్ తనిఖీల నేపథ్యంలో గత డిసెంబరులో రూ.18 లక్షలతో వ్యాయామశాల ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం ఏడాది వరకు వారెంటీ ఉంది. అందులో ఏ పరికరాలు పోయినా మరమ్మతులు చేస్తారు. వీలుకాకుంటే కొత్తవి ఏర్పాటు చేస్తారు. అధికారుల నిర్లక్ష్యంతో 9 నెలల నుంచి జిమ్ తలుపులు కూడా తెరవలేదు. విమర్శలు వస్తున్నాయని తాజాగానే తెరిచారు. మరో మూడు నెలల్లో గడువు ముగియనుంది.

అంతా మా ఇష్టం

వైకాపా పాలనలో ట్రిపుల్‌ఐటీ అధికారుల్లో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుకుంది. వైకాపా నేతకు ప్రాంగణంలోనే ఫుడ్ కోర్టు అప్పగించారు. అద్దె బకాయిలు దాదాపు రూ.60 లక్షలకు చేరినా వసూలు చేయలేదు. గడువు ముగిసినా ఏడాదిన్నర పాటు అనధికారికంగా వ్యాపారం చేయించారు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ బకాయిలు చెల్లించలేదు. ఇలాంటి తార్కాణాలు గత అయిదేళ్లలో కోకొల్లలు. అధికారులు నేతల చేతుల్లో కీలు బొమ్మలుగా మారి పోయారు. వారికి లబ్ధి చేకూర్చే పనులు తప్ప విద్యార్థులకు ఉపయోగపడే పనులు మచ్చుకైనా కానరావు. దీనిపై డైరెక్టర్ అమరేంద్ర మాట్లాడుతూ.. ప్రాంగణంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు.

బాబోయ్.. వేసవిలా ఎండలు!



నైరుతి నిష్క్రమించినా ఏదీ ఉపశమనం

కుక్కునూరు, పోలవరం, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రస్తుతం నైరుతి నిష్క్రమించింది. వర్షాలు తగ్గుముఖం పట్టాయి. మామూలుగా అయితే చలి వాతావరణం పెరగాలి. కానీ ఎండలు ప్రచండంగా కాస్తున్నాయి. శుక్రవారం ఉమ్మడి జిల్లా ప్రజానీకం ఉక్కపోతతో సతమతమయ్యారు. చాలా చోట్ల మధ్యాహ్న సమయంలో వీధులు నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రియల్‌టైమ్ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. పశ్చిమలో అత్యధికంగా తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటలో 36.01, ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురంలో 36.65 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. ఏలూరు జిల్లాలోని 18 మండలాల్లో 35 డిగ్రీలకు పైబడి నమోదు కావడం జిల్లాలో ఎండల తీవ్రతకు అద్దం పడుతోంది.. ఇందులో 8 మండలాల్లో 36 డిగ్రీలకు పైబడి ఎండ తీవ్రత కొనసాగింది. పచ్చని పంట పొలాలతో చల్లని వాతావరణంతో ఉండే డెల్టా ప్రాంతంలో కూడా అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కావడం ఆశ్చర్యకరం. నైరుతి కాలం గత నాలుగు నెలల్లో తొమ్మిది అల్పపీడనాలు, భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లా అతలాకుతలం కాగా, ఇప్పుడు తీవ్రమైన ఎండలతో సతమతమవ్వాల్సి వస్తోంది.

శుక్రవారం ఒంటిగంట సమయంలో 36 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

మండలం	గ్రామం
నూజివీడు	మీర్జాపురం
ఏలూరు	శ్రీపర్రు
టి.నరసాపురం	రాజుపోతేపల్లి
ఉంగుటూరు	కాకర్లమూడి
ముదినేపల్లి	ముదినేపల్లి
ఏలూరు	ఏలూరు
కొయ్యలగూడెం	గవరవరం
లింగపాలెం	ధర్మాజీగూడెం
తాడేపల్లిగూడెం	జగ్గన్నపేట
పెనుగొండ	పెనుగొండ
భీమవరం	గొల్లవానితిప్ప



మల్చింగ్ వైపు మిరప రైతులు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మిరప రైతులు మల్చింగ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానంలో కలుపు బెడద, పెట్టుబడులు తగ్గనుండటంతో అటు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ రెండు మండలాల్లో దాదాపు వెయ్యికి పైగా ఎకరాల్లో మిరప సాగు ఉండగా.. దాదాపు 600 ఎకరాల్లో మల్చింగ్ విధానం పాటిస్తున్నారు. ప్రస్తుతం ఆయా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముందుగా భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఆ తరువాత తగ్గుతాయి. ఈ నేపథ్యంలో ఆర్థికంగా చేయితిరిగిన వారు మాత్రమే అనుసరిస్తున్నారు. ఎకరాకు రూ.45-50వేల వరకూ పెట్టుబడి అవుతుంది.

కొనేది రూ.17 అమ్మేది రూ.60



● ఉల్లి మార్కెట్‌లో దళారుల దందా
● నష్టపోతున్న రైతులు, వినియోగదారులు

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కేజీ ఉల్లి రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తుంటే రైతుకు చెల్లించే ధర రూ.17 ఉండటం గమనార్హం.

హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే లోడులు (రోజుకు)	25 టన్నుల లారీలు 12
హోల్‌సేల్ ధర కేజీ :	రూ.50 నుంచి రూ.60
బహిరంగ మార్కెట్ ధర కేజీ	రూ.60 – రూ.70

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కూరల్లో నిత్యావసరమైన ఉల్లి ధర ఆకాశాన్నంటుతోంది. రైతుకు మాత్రం గిట్టుబాట ధర లభించకపోవడం గమనార్హం. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ ఉల్లి వ్యాపారానికి పెట్టింది పేరు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో ఉల్లి గూడెం మార్కెట్‌కు దిగుమతి అవుతుంది. దేశ విదేశాలకు పెద్ద మొత్తంలో ఉల్లిపాయలు ఎగుమతి చేస్తుంటారు. దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి సరైన ధర కల్పించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలు రైతులు దళారుల కారణంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

నమ్మి వస్తే... గూడెం మార్కెట్‌లో ఉల్లిపాయలకు మంచి ధర వస్తుందని సుదూర ప్రాంతాల రైతులు కిరాయి కట్టించుకుని ఇక్కడకొస్తున్నారు. వ్యాపారులు చెబుతున్న ధర చూసి రైతులు కంగుతింటున్నారు. రవాణాకు రూ.వేలు వెచ్చించి తీసుకొచ్చిన పంట వెనక్కి తీసుకెళ్లలేక నష్టానికే అమ్ముకుని దళారుల చేతుల్లో నిండా మోసపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

డిమాండ్ ఉన్నా..



మార్కెట్‌లో ఎంత డిమాండ్ ఉన్నా దళారుల కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఎకరానికి రవాణా ఛార్జీలతో కలిపి రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. పంట విక్రయిస్తే రూ.1.50 లక్షలు మాత్రమే వస్తోంది. రూ.50 వేలకు పైగా నష్టపోవాల్సి వస్తోంది. గూడెం మార్కెట్‌లో ఎక్కడా లేని విధంగా కేజీకీ రూ.17 మాత్రమే చెల్లిస్తున్నారు. గత్యంతరం లేక నష్టానికే పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది.

-హరీశ్, ఉల్లిరైతు, పి.కోటకొండ గ్రామం

మద్యం దుకాణాలకు 115 దరఖాస్తులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల ఏర్పాటుకు జిల్లాలో శుక్రవారం నాటికి 115 దరఖాస్తులు అందాయి. చింతలపూడిలో 38, నూజివీడులో 29, భీమడోలులో 20 చొప్పున ఔత్సాహికులు దరఖాస్తులు సమర్పించారు. జిల్లా కేంద్రం ఏలూరు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 41 మద్యం దుకాణాలుండగా- ఇప్పటి వరకు 3 దరఖాస్తులే వచ్చాయి. పోలవరంలో 6, కైకలూరులో 5, జంగారెడ్డిగూడెంలో 14 చొప్పున దరఖాస్తులందాయి.

జిల్లా అదనపు ఎస్పీగా సూర్యచంద్రరావు



ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా నక్కా సూర్యచంద్రరావు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అయిదుగురు అదనపు ఎస్పీలను బదిలీలు చేస్తూ శుక్రవారం డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఐడీ విభాగంలో పని చేస్తున్న సూర్యచంద్రరావును ఏలూరు అదనపు ఎస్పీగా నియమించారు. రెండేళ్ల క్రితం వరకు అదనపు ఎస్పీగా స్వరూపారాణి ఉన్నారు. ఆమె బదిలీ కాగా, ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం అదనపు ఎస్పీగా నియమితులైన సూర్యచంద్రరావు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీగా పని చేసి రెండు నెలల క్రితమే సీఐడీ విభాగానికి వెళ్లారు. ఏలూరులో సీఐగా సుదీర్ఘకాలం పని చేసి... డీఎస్పీగా, అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు.

డ్వామా పీడీ బాధ్యతల స్వీకారం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీగా కేవీ సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 'స్వచ్ఛాంధ్ర మిషన్' ఈడీగా పని చేస్తున్న ఈయన్ను ప్రభుత్వం ఏలూరు డ్వామా పీడీగా నియమించిన సంగతి విదితమే. ఆయన శుక్రవారం ప్రస్తుత పీడీ ఎ.రాము నుంచి బాధ్యతలు అందుకున్నారు. రాము ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీగా బదిలీ అయ్యారు.

ప్రోత్సాహమస్తు

● ఈ నెల నుంచే పెంచిన సాయం వర్తింపు
● ఉమ్మడి జిల్లాలో 281 దేవాలయాలకు లబ్ధి

పాలకొల్లు, న్యూస్‌టుడే: ఆదాయం లేని దేవాలయాలకు ధూప దీప నైవేద్య సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న 281 దేవాలయాలకు ఈ పెంపు వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో ఒకటో రెండో ఆలయాలుంటే చిన్న ఆలయాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వీటికి ఎటువంటి ఆదాయ వనరులు లేకపోవడంతో స్థానికులే కమిటీలుగా ఏర్పడి అర్చకులను ఏర్పాటు చేస్తున్నారు. అదికూడా లేక మరికొన్ని చోట్ల ఆలయాలకు సంబంధించిన పండగలకు మాత్రమే అర్చకులను పెట్టి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయాలకు శిఖర ప్రతిష్ఠ చేసిన వాటికి కచ్చితంగా నిత్యం ధూప దీప నైవేద్యాలు పెట్టాలనే ఆచారం ఉండటంతో స్థానికంగా అందుబాటులో ఉన్న అర్చకులే ఏదో ఒక సమయంలో వచ్చి ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక మీదట ఆయా అర్చకులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం పెంచిన సాయం రూ.28.10 లక్షలు నెలనెలా అర్చకుల ఖాతాలకే జమ కానుంది.

	● పెంపు వర్తిస్తున్న దేవాలయాలు	● ప్రైవేటు దేవాలయాలు
పశ్చిమ	122	1442
ఏలూరు	159	1150



9ఏళ్ల తర్వాత

2015లో తెదేపా హయాంలో ఈ సాయాన్ని రూ.2,500 నుంచి రూ.5 వేలకు పెంచారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో పైసా కూడా పెంచలేదు. పెరిగిన ధరలతో రూ.5 వేలకు ఆలయంలో అర్చకుడు అన్నీ తానై సమకూర్చుకోవాలంటే అయ్యే పనికాదని గ్రహించిన కూటమి ప్రభుత్వం తాజా పెంపునకు శ్రీకారం చుట్టింది. దీనిపై దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఇ.వి.సుబ్బారావు స్పందిస్తూ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో గతం నుంచి నైవేద్య సాయం అందుతూ దేవాదాయ శాఖ రిజిస్ట్రేషన్ చేసుకున్న అల్పాదాయ దేవాలయాలకు పెంపు వర్తిస్తుందన్నారు. ప్రైవేటు ఆలయాలకు ప్రోత్సాహం నిమిత్తం ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. పశ్చిమలో వేదం నేర్చుకున్న 44 మంది పండితులకు నిరుద్యోగ భృతి కోరుతూ నివేదిక అందించామన్నారు.

ప్రైవేటులో సైతం

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు నిర్వహణలో సుమారు 2,592 చిన్న చిన్న ఆలయాలు ఉన్నాయి. వీటికి కూడా ప్రోత్సాహం అందించాలని దేవాదాయ శాఖ ప్రతిపాదనలు చేసింది. దీనిపై ఎటువంటి నిర్ణయం వెలువడుతుందోనని ఆయా ఆలయాలకు చెంది కమిటీలు ఎదురుచూస్తున్నాయి.

కటకటాల్లోకి కవలలు!

✸ గొలుసు చోరీల కేసుల్లో అరెస్టు
✸ పెద్ద మొత్తంలో బంగారు నగలు స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వారు కవలలు. ఒంటరి మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కెళ్తూ... పోలీసుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ కేసు వివరాలు వెల్లడించారు. ఆగస్టులో కృష్ణాష్టమి పండగ రోజు రాత్రి 7 గంటల సమయంలో ఓ మహిళ ఒకటో పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి ఒంటరిగా వెళ్తున్నారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఇద్దరు ఆగంతుకులు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఒకటి, రెండో పట్టణాల్లో వరుస గొలుసు చోరీలకు పాల్పడ్డారు. అప్రమత్తమైన ఎస్పీ నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యాన ఒకటో పట్టణం సీఐ జి సత్యనారాయణ, ఎస్సై మదీనాబాషా, వారి సిబ్బందిని ఓ బృందంగా, గణపవరం సీఐ ఎం.వి.సుభాష్ నేతృత్వంలో మరో బృందాన్ని నియమించారు. స్థానిక తూర్పువీధి మాదేపల్లివీధిలోని ప్రేమాలయం సమీపంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. గొలుసు చోరీలకు పాల్పడింది వారేనని నిర్ధారించుకొని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 కేసులకు సంబంధించి 36 కాసులు బంగారు గొలుసులు, మరో కేసులో 24 గ్రాముల బంగారు గొలుసు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కైకలూరులో జరిగిన నేరాలకు సంబంధించి సొత్తు స్వాధీనం చేసుకోవాల్సి ఉందని ఎస్పీ పేర్కొన్నారు.

ఇద్దరూ పాతనేరస్థులే... 'ఆయా కేసుల్లో అరెస్టయిన నిందితులిద్దరూ ఏలూరు గ్రామీణ మండలం పైడిచింతపాడుకు చెందిన సైదు రాఘవేంద్రప్రసాద్, సైదు రవీంద్రప్రసాద్ కవలపిల్లలు. ఇద్దరూ పాతనేరస్థులే. 2022లోనూ వరుస నేరాలకు పాల్పడ్డారు' అని ఎస్పీ వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు : మంత్రి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారులతో శుక్రవారం సమీక్షించి, మాట్లాడారు. ధాన్యం తేమ శాతాన్ని కొలిచేందుకు రైతు సేవా కేంద్రాల వద్ద సాంకేతిక సహాయకులతోపాటు మిల్లర్ల సంఘం తరఫున ఒకరిని కేటాయించాలన్నారు. ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనంలో కచ్చితంగా టార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. గోనె సంచులకు రైతులు ఇబ్బంది పడకూడదని దిశానిర్దేశం చేశారు. జేసీ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ... రైస్ మిల్లర్ల వద్ద గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. ఒక్కో సంచికి రూ.3.39, హమాలీ ఛార్జీలుగా క్వింటాకు రూ.17.17గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. ధాన్యం ఎగుమతి చేసిన ప్రాంతం నుంచి రైస్ మిల్లు వద్ద దిగుమతి చేసే వరకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, డీఎఫ్‌వో రవీంద్ర దామా, డీఎస్‌వో సత్యనారాయణరాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి బంగారు తాపడం


విరాళం పత్రాన్ని ఛైర్మన్ సుధాకరరావుకు అందజేస్తున్న దీపక్ నెక్స్‌జెన్ కంపెనీ ప్రతినిధులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ సంస్థ అందించిన రూ.1,64,19,411 విరాళంతో తయారు చేయించిన బంగారు తాపడాన్ని ద్వారకాతిరుమల శ్రీవారి గర్భాలయంలో శుక్రవారం అమర్చారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు.. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు వారికి స్వామివారి శాలువాలు కప్పి వేదాశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు శ్రీవారి చిత్రపటాలను బహూకరించారు. విరాళానికి సంబంధించిన పత్రాన్ని కంపెనీ ప్రతినిధులు ఆలయ ఛైర్మన్‌కు ఇచ్చారు.

ప్రసాదాల తయారీ పాత్రల వితరణ



ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన రూ.5 లక్షలు విలువ చేసే వంట పాత్రలను ఏలూరు షణ్ముఖ ఫైనాన్స్ సంస్థ వారు ఆలయ అధికారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు దాతలను అభినందించారు.

7న మౌఖిక పరీక్షలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పాత పంచాయతీ కార్యాలయ ఆవరణలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, యువజన సేవల శాఖ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 7న మహిళలకు ప్రత్యేక మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు తెలిపారు. 'లిక్సిల్ ఇండియా శానిటరీ వేర్' సంస్థ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎనిమిదో తరగతి, ఆపై చదివి... 18 నుంచి 30 ఏళ్లలోపు వయసున్న మహిళలు హాజరు కావచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలో ఈ నెల 6 నుంచి నిర్వహించనున్న ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శుక్రవారం మహాసభ గోడపత్రాలు ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనరు జి.కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నంబాబు, జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీ మహేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మానవ వనరులు, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌ను కోరారు. నూజివీడు రైల్వేస్టేషన్‌లో గౌతమి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని విజయవాడలో దక్షిణ మధ్య రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు.

డిజిటల్ బోధన.. భవితకు నిచ్చెన

దివ్యాంగుల విద్యా ప్రమాణాలు మెరుగునకు కృషి

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ చిన్నారుల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నారు. ఇప్పటి వరకు పుస్తకాల్లోని బొమ్మలను చూపుతూ తరగతి పాఠ్యాంశాలు చెబుతుండగా మారుతున్న సాంకేతికతను దివ్యాంగ చిన్నారులు అందిపుచ్చుకుని చదువుల్లో ఆసక్తి పెంచుకోవాలనే సంకల్పంతో పూర్తి అంధత్వం, వినికిడి సమస్యలున్న వారికి డిజిటల్ విధానంలో బోధిస్తున్నారు.

యాప్‌లతో ప్రయోజనాలు ఎన్నో

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లో 21 రకాల యాప్‌లను పొందుపరిచారు. వీటితో చిన్నారులకు తరగతి పాఠ్యాంశాలు సులభతరంగా అర్థమవుతున్నాయి. ముఖ్యంగా గూగుల్ లుక్ అవుట్ యాప్ ద్వారా వినికిడి, దృష్టి లోపాలున్న విద్యార్థులకు ఏదైనా ఒక వస్తువు పదం ఏవిధంగా పలకాలి ట్యాబ్‌ను ఎలా వినియోగించాలి వంటి అనేక విషయాలపై తర్ఫీదు అందిస్తున్నారు. వినికిడి సమస్య ఉన్న వారికి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అక్షర రూపంలో కనిపించడం.. అంధ విద్యార్థులు మరొకరి సాయం లేకుండా గూగుల్ మ్యాప్స్ ఉపయోగించి యాప్‌లు ఇందులో ఉండటంతో విద్యార్థులు అనేక ప్రయోజనాలు సమకూరుతున్నాయి. ఇవి కాక గూగుల్ ఫ్యామిలీ లింక్ యాప్ ద్వారా ట్యాబ్‌లో విద్యార్థులు చేసే ప్రతి పనిని ఉన్నతాధికారులు ప్రత్యేక యాప్ ద్వారా సమీక్షిస్తూ ఉపాధ్యాయుల బోధన తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 28 భవిత కేంద్రాలతో పాటు జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు, ఐఈడీఎస్ఎస్, ఐఆర్పీ ఉపాధ్యాయులకు కలిపి 173 ట్యాబ్‌లు అందించారు.


విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా

దివ్యాంగుల విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సాంకేతికత జోడించి ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా డిజిటల్ బోధన అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులకు సులభంగా బోధన చేసేందుకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. యాప్‌లను ఏవిధంగా వినియోగించాలి వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు.

సాంకేతిక విద్య అందించాలనే..

వినికిడి, దృష్టి లోపాలున్న విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో ట్యాబ్‌లు అందించి డిజిటల్ విధానంలో విద్యాభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు జిల్లాలో 26 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించాం. యాప్‌ల ద్వారా ఉన్న తర్ఫీదులను విద్యార్థుల సామర్థ్య ప్రగతి పర్యవేక్షిస్తూ చదువులో నూరుశాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖ అధికారి

రజక విశ్రాంతి భవనాలు నిర్మించాలి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజక విశ్రాంతి భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని రజక జన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ కట్లయ్య కోరారు. స్థానిక సంఘ భవనంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రజకుల వృత్తి చెరువులకు సంబంధించిన అద్దెలు నిర్ధారిస్తూ జారీ అయిన జీవోలను అమలు చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రజకులకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ఆ మేరకు చొరవ చూపాలని కోరారు. సంఘ నాయకులు కె.మురళి, కె.వెంకటేశ్వర్లు, ఎస్.మహాలక్ష్మి, బి.మంగాదేవి, ఆర్.సుబ్బారావు, డి.సుబ్బయ్య, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పదనాన్ని కాపాడుకోవాలి

అనంత శ్రీరామ్

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: తెలుగు భాష గొప్పదనాన్ని, ఆవశ్యకతను భావి తరాలకు తెలియజేయడమే కాకుండా భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ అన్నారు. పాలకొల్లు పట్టణం క్షత్రియ కల్యాణ మండపంలో రస ధుని సాహితీ సంస్థ, క్షత్రియ సంక్షేమ పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు విజయం, సాహిత్య రూప కల్పన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు తీయదనాన్ని ఎప్పటికీ విడదీయలేరన్నారు. నిత్య సన్మార్గ నిర్దేశక సాధనం సాహిత్యం అన్నారు. ఆలోచింప చేయగల శక్తి అవధాన ప్రక్రియకే ఉందన్నారు. సహస్ర అవధాని డాక్టర్‌కడిమిళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ తరాలు మారినా తెలుగుభాష విరాజిల్లుతూనే ఉంటుందన్నారు. మేధాశక్తిని ప్రత్యక్షంగా చూపగలిగే శక్తి అవధాని సాహిత్యంతోనే సాధ్యం అన్నారు. పలువురు కవులు తెలుగు సంప్రదాయాలపై మాట్లాడారు. ఆనాటి చరిత్రలను పద్య రూపంలో గీతాలు ఆలపిస్తూ వాటి విలువలను తెలియజేశారు. కవులు అబ్బిరెడ్డి పేరయ్యనాయుడు, బలుసు అపర్ణ, చేగొండి వీరవెంకట సత్యనారాయణమూర్తి, రెడ్డప్ప దవేజీ, సభ్యులు పి.లక్ష్మీనారాయణ, కొట్టు భాస్కరరావు, డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, జయదుర్గారావు, యర్రంశెట్టి వెంకటరత్నం తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సినీ గేయ రచయిత

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక శాంతినగర్‌లో జిల్లా చదరంగం కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం అండర్-15 బాలబాలికల జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు గుంటూరులో జరగనున్న పోటీలు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలకు ఆదిత్య కిడ్స్ అకాడమీ అధినేత రత్న కిశోర్ అభినందన పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ విశ్వకర్మ, సహాయ కన్వీనర్లు వాసుదేవరావు, శిరిగినీడి కోటేశ్వరరావు, కాశీ శివరంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో నిర్వాహకులు

విజేతలు వీరే... బాలుర విభాగం: అబ్రహమ్ గంజి, కర్రి ఓంకార్, పెద్దింటి ఉదయ్ కుమార్, వై.రోహన్. బాలికల విభాగం: సోనాలి కన్న, తన్మయి బుద్దన్న, యడ్ల ప్రేమ రక్షిత, తురసం శశి ప్రియాంక.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!


పేరుపాలెం బీచ్‌లో గూళ్లు కడుతున్న చిన్నారులు

దసరా సెలవుల నేపథ్యంలో సందర్శకులతో పేరుపాలెం బీచ్ సందడిగా మారింది. సాగరతీరంలో చిన్నారులు గుజ్జనగూళ్లు కడుతూ కేరింతలు కొట్టారు. యువకులు గుర్రపుస్వారీ చేశారు. అలల నడుమ చరవాణుల్లో స్వీయచిత్రాలు తీసుకుంటున్నారు. ఒకప్పుడు శని, ఆదివారాల్లో సందడిగా కనిపించే బీచ్ సెలవుల కారణంగా రోజూ పర్యాటకులతో కళకళలాడుతోంది. శుక్రవారం కనిపించిన చిత్రాలివి.

-ఈనాడు, నరసాపురం.


గుర్రపుస్వారీ చేస్తున్న యువకుడు

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

పెదవేగి, న్యూస్‌టుడే: స్థానిక గురుకుల బాలుర పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-19 విభాగంలో శుక్రవారం నిర్వహించిన సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా బాలబాలికలు జట్లు విజేతలుగా నిలిచాయి. మూడ్రోజులపాటు జరిగిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 420 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బాలబాలికల జట్లు విజేతగా నిలవడంతో వారికి గురుకుల పాఠశాలల సమన్వయకర్త ఎన్.భారతి ట్రోఫీలు అందజేసి అభినందనలు తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.జయరాజు, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, క్రీడా పోటీల పరిశీలకులు కె.వెంకటేశ్వరరావు, పి.సుబ్బారావు, పీఈటీ గురుమూర్తి, పీడీలు, పీఈటీ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టు పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు

నకిలీ నోట్లు ఎరజూపి.. రూ.లక్షలు కాజేసి..!

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అసలు నోట్లకు బదులుగా రెట్టింపు స్థాయిలో నకిలీవి ఇస్తానని నమ్మబలికి నగదు కాజేసిన వ్యక్తిని పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. ఎస్సై జబీర్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడేనికి చెందిన భద్రా జ్యోతికుమార్.. స్థానిక జేపీ సెంటర్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. అతడికి అదే పట్టణానికి చెందిన మద్దిపాటి కల్యాణ్‌తో కొద్ది రోజుల కిందట పరిచయం ఏర్పడింది. నకిలీ నోట్ల చలామణిలో భాగంగా కల్యాణ్.. రెండు రూ.500 నోట్లను మార్చుకోమని జ్యోతికుమార్‌కిచ్చాడు. అవి మారడంతో రూ.45 వేలు అసలు నోట్లు తీసుకుని రూ.95 వేలు నకిలీవి ఇచ్చాడు. అనంతరం మరో రూ.4 లక్షలు తీసుకుని రూ.12 లక్షలు నకిలీవి ఇస్తానని నమ్మబలికి తప్పించుకుని తిరుగుతున్నాడు. నకిలీ నోట్లు ఇవ్వాలంటే కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం దాబా వద్దకు రూ.2 లక్షలు తీసుకురావాలని చెప్పడంతో గత నెల 29న జ్యోతికుమార్ అక్కడకు వెళ్లాడు. డబ్బులు చేతులు మారుతున్న సమయంలో పోలీసులు వస్తున్నారని సైరన్ మోగించి జ్యోతికుమార్ వద్ద ఉన్న నగదు తీసుకుని.. మరో బ్యాగు చేతిలో పెట్టి నిందితుడు, అతడితో పాటు మరికొంతమంది పరారయ్యారు. కొద్దిసేపటి తరువాత బ్యాగు తెరిచి చూడగా.. అందులో తెలుపు రంగు కాగితాలు ఉన్నాయి. మోసపోయినట్లు గుర్తించిన జ్యోతికుమార్ జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు కల్యాణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

వెంటాడుతున్న ప్లాస్టిక్ భూతం

చెత్తలో సగానికి పైగా పాలిథిన్ వ్యర్థాలే

ఈనాడు డిజిటల్, భీమవరం, అత్తిలి, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:

ఓ వైపు పర్యావరణానికి .. మరో వైపు ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతోంది ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ (ఎస్‌యూపీ). వీటిని పూర్తిగా నిషేధించినా యథేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల్లో రోజుకు 272 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా సగానికి పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా రహదారులు, డంపింగ్ యార్డుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. డంపింగ్ యార్డులకు శాశ్వత స్థలాలు కేటాయించకపోవడం, రహదారులు, కాలువలు, నదుల చెంతనే వ్యర్థాలు వేసి కలుషితం చేస్తున్నారు. వీటిని రోడ్లకిరువైపులా, పంట కాలువల్లో పడేస్తున్నారు.

పట్టణం	రోజూ ఉత్పత్తయ్యే చెత్త (టన్నుల్లో)	ప్లాస్టిక్ వ్యర్థాలు
భీమవరం	75	40
పాలకొల్లు	40	20
తణుకు	45	20
తాడేపల్లిగూడెం	80	35
నరసాపురం	32	18


తణుకులోని పంట కాలువ

తనిఖీలు నామమాత్రమే

120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై, ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) బాటిళ్లపైన నిషేధం ఉంది. వీటి వినియోగంపై అధికారుల తనిఖీలు నామమాత్రం కావడంతో వినియోగం కొనసాగుతోంది. ఏ దుకాణంలో చూసినా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కుప్పలు తెప్పలుగా వినియోగిస్తున్నారు. అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి, జరిమానాలు విధించినా కొన్నిరోజుల తర్వాత వాటి వినియోగం సర్వసాధారణం అవుతోంది. "ప్లాస్టిక్ నానో రేణువులు శరీరంలోని అన్ని అవయవాల్లోకి ప్రవేశించి కణ వ్యవస్థను దెబ్బతీస్తాయి. ప్లాస్టిక్ వస్తువుల్లో తినడం, తాగడం చేయకూడదు." అని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు అన్నారు.

స్థలం కబ్జా చేశారంటూ మంత్రికి ఫిర్యాదు

తాడేపల్లి, న్యూస్‌టుడే : డబుల్ రిజిస్ట్రేషన్ చేసి తాము కొనుగోలు చేసిన స్థలాన్ని వైకాపా ప్రభుత్వం అండతో కబ్జా చేశారని కృష్ణాజిల్లా మొవ్వ మండలం బట్లపెనుమర్రుకు చెందిన సంగిశెట్టి సీతారావమ్మ, మాచర్ల విజయలక్ష్మి, మునగాల మాధవి 'ప్రజాదర్బార్'లో మంత్రి నారా లోకేశ్‌కి ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో మంత్రి నారా లోకేశ్‌కి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వకుండా అసిస్టెంట్ ఇంజినీర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏలూరు జిల్లా పెదవేగికి చెందిన రాజబోయిన సీతమ్మ మంత్రి లోకేశ్‌కి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న డాక్యుమెంట్లతో విద్యుత్తు సరఫరా కోసం దరఖాస్తు చేశారు. రూ.44 వేలు డీడీ చెల్లించాను. నేటి వరకు పెదవేగి అసిస్టెంట్ ఇంజినీర్ విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు, విద్యుత్తు లైన్లు వేయడంలో తాత్సారం చేస్తున్నారని తెలిపారు. అనేకసార్లు విన్నవించిన ఫలితం లేదని వాపోయారు.

ప్రాణం తీసిన చిన్ననాటి స్నేహం

● ప్రేమ నిరాకరించిందని మిత్రుడి దారుణం ● మియాపూర్ యువతి హత్య కేసులో వీడిన మిస్టరీ

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ ఠాణా పరిధిలో గతనెల 30న సంచలనం సృష్టించిన యువతి స్పందన హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తకు దూరంగా ఉంటున్న ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతూ నిరాకరించడంతోనే చిన్ననాటి స్నేహితుడే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ వివరాలను మియాపూర్ సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ వెల్లడించారు.

మియాపూర్ పరిధిలోని దీప్తి శ్రీనగర్ కాలనీ సీబీఆర్ ఎస్టేట్స్‌లో ఉండే స్పందన గతంలో ఓ ప్రైవేటు బ్యాంకులో పని చేసి మానేసింది. ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ తల్లితో కలిసి ఇంటి వద్దే ఉంటుంది. 2022 ఆగస్టులో చిన్నప్పటి స్నేహితుడు వినయ్ కుమార్‌తో పెద్దల సమక్షంలో వివాహమైంది. మనస్పర్థలు రావడంతో ఏడాది తర్వాత దంపతులిద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. ఒంటరిగా ఉంటున్న ఆమెకు దగ్గరయ్యేందుకు చిన్ననాటి స్నేహితుడు ఏలూరుకు చెందిన మనోజ్ కుమార్ అలియాస్ బాలు ప్రయత్నాలు ప్రారంభించాడు. మియాపూర్ సుదర్శన్‌నగర్‌లో ఉంటున్న అతను ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంటపడుతున్నాడు. ఆమె అంగీకరించకపోవడంతో హత్య చేయాలని పథకం పన్నాడు. గతనెల 30న స్పందన తల్లి విధుల నిమిత్తం పాఠశాలకు వెళ్లగా ఆమె ఒంటరిగా ఉందని ఇంటికొచ్చాడు. తన ప్రేమను నిరాకరించడంతోపాటు తమతోపాటు చదువుకున్న కొందరు స్నేహితులతో స్నేహంగా ఉంటున్నావంటూ వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో వెంట తెచ్చుకున్న గ్రానైట్ రాయితో ఆమె తలపై మోది స్క్రూడ్రైవర్‌తో మొహంపై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం రాయితోపాటు స్క్రూడ్రైవర్‌ను వేర్వేరు చోట్ల పడేసి వెళ్లిపోయాడు.

ఆధారాలు లేకుండా నాటకం

ఘటనాస్థలికి వచ్చిన పోలీసులకు హత్య చేసిన మనోజ్ కుమార్ ఆమెకు సంబంధించిన కొన్ని వివరాలను స్నేహితుడి మాదిరిగా అందించే యత్నం చేశాడు. హత్య చేయడంతో పాటు ఎటువంటి బెరుకు లేకుండా తాపీగా తిరిగి స్పందన ఇంటికి చేరుకుని అందరితో కలివిడిగా ఉంటూ అనుమానం రాకుండా నటించాడు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న డీసీపీ వినీత్ ఆదేశాల మేరకు మియాపూర్ ఏసీపీ నరసింహారావు సీఐ దుర్గా రామలింగ ప్రసాద్, ఎస్సైలు వెంకటేష్, నరసింహారెడ్డి బృందం సీసీకెమెరాల దృశ్యాలు, సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా పలు కోణాల్లో విచారించడంతో ఈ హత్య వ్యవహారం వెలుగుచూసింది. మనోజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మద్యం మత్తులో ఒకరిపై దాడి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో నలుగురు ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన నూజివీడులో జరిగింది. పెద్ద చెరువు సమీపంలో శ్రీను అనే వ్యక్తిని మరో నలుగురు వ్యక్తులు మద్యం తాగి గురువారం రాత్రి కర్రలతో దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. మద్యం మత్తులో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగర శివారులో చోటుచేసుకుంది. జూట్‌మిల్ రైల్వే పైవంతెన కింద శుక్రవారం సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని ఘటనా స్థలిలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పైII తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

● ఏలూరు ● దెందులూరు ● ఉంగుటూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే

సమస్య: శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాల్లోని నివాసితులకు వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. వాడుక నీటికీ ఇబ్బందులు పడుతున్నాం.

- శ్రీనివాసరెడ్డి, స్థానికుడు

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం

- భానుప్రతాప్, నగరపాలక అధికారి

సమస్య: స్థానిక శాంతినగర్ ఎనిమిదో రోడ్డులో కొన్నాళ్లుగా చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. రోజుల తరబడి వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వెంటనే చెత్త తొలగింపజేస్తాం. **- మాలతి, ఎంహెచ్‌వో**

సమస్య: శాంతినగర్, సత్రంపాడులో రహదారిని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. **- శ్రీనివాస్, స్థానికుడు**

సమాధానం: ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

స్పందనకు వందనం

దోమల నివారణ మందు పిచికారీ.. **ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** పోస్టల్ కాలనీ నాగదేవత ఆలయ రోడ్డులో దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. మురుగు పేరుకుపోవడంతో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన గత నెల 30న ప్రచురితమైన వార్తకు నగరపాలక అధికారి భానుప్రతాప్ స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు.

వెలిగిన వీధి దీపం.. ఏలూరు నుంచి పెదపాడు మార్గంలో పంపుల చెరువు ఎదుట విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన వీధి దీపం ఎట్టకేలకు వెలిగింది. పది రోజులుగా దీపం వెలగకపోవడంపై ఈ నెల 4న వార్త ప్రచురితమైంది. విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో వీధి దీపాన్ని బాగు చేయించారు.

నగరంలో 'ఈనాడు'

స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి భవనంలో శనివారం ఉదయం 9.30 గంటలకు శరన్నవరాత్రుల మహోత్సవం, కేవీ సత్యనారాయణ సాహిత్య ప్రతిభా పురస్కార సభ నిర్వహించనున్నారు.

- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక పవరుపేటలోని విడిది కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు ఏ సమస్యనైనా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే తగిన పరిష్కార మార్గం చూపుతానని హామీ ఇచ్చారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ప్రాణాలతో చెలగాటం!

★ పవరుపేట రైల్వే గేటు మూసివేత ★ పట్టాలపై ప్రమాదకరంగా రాకపోకలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే

ప్రాణం ఎంతో విలువైంది. కొందరు నిర్లక్ష్య వైఖరితో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇందుకు పవరుపేట రైల్వే గేటు వద్ద విన్యాసాలే నిదర్శనం. నగరంలోని పవరుపేట వద్ద రైలు పట్టాల మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13 వరకు గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఆ మేరకు గేటును మూసివేశారు. వాహనాలు, ప్రజల రాకపోకలు ఆపేశారు. అయినా, కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రైల్వే గేటు కింద నుంచి ప్రమాదకరంగా దూరి అవకతలి వైపునకు వెళుతున్నారు. మరికొందరు సైకిళ్లతో సర్కస్ ఫీట్లు చేస్తున్నారు.



గేటు కింద నుంచి దాటుతున్న ఓ వ్యక్తి

సిగ్నల్ పడకపోవడంతో...

సాధారణ పరిస్థితుల్లో పవరుపేట రైల్వే గేటు వేసినప్పుడల్లా రెడ్ సిగ్నల్ పడేది. ప్రస్తుతం గేటు మూసేయడంతో సిగ్నల్ పడటం లేదు. ఏ నిమిషాన ఏ రైలు ఎటు వైపు వెళుతుందో తెలియని పరిస్థితుల్లో... రైల్వే గేటు కింద నుంచి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. రైల్వే అధికారులు వెంటనే స్పందించి మూసి ఉన్న గేటు కింద నుంచి ఎవరూ వెళ్లకుండా కట్టడి చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా... పవరుపేట రైల్వే గేటు మూతతో సమీపానున్న కింది వంతెనల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారుల సంఖ్య పెరిగింది. దాంతో ట్రాఫిక్ తీవ్రత ఎక్కువైంది. రైల్వే గేటు తెరిచే వరకు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా రైలు పట్టాలు దాటుతున్న ప్రజలు

రక్తదాన శిబిరానికి స్పందన

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 35 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. సంస్థ జిల్లా ఛైర్మన్ కృష్ణారెడ్డి, ప్రధానాచార్యుడు కె.శ్రీనివాస్, డాక్టర్ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు.. ఏలూరు విద్యా విభాగం: స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు 'డిజిటల్ మౌలిక సదుపాయాలు- భారతదేశ సమగ్రతకు నూతన వ్యూహం'పై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులు లావణ్య, భానుప్రణతి, ప్రవల్లికకు బహుమతులు ప్రదానం చేశారు.

బాధితులకు మెరుగైన సేవలందించండి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: బాధితులకు మెరుగైన సేవలందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని వన్‌స్టాప్ సెంటర్‌ను శుక్రవారం పరిశీలించారు. అక్కడి సేవలపై ఆరా తీశారు. కేసుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆన్‌లైన్ ఫిర్యాదుల నమోదు ప్రక్రియ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

వృత్తిపై అంకితభావం అవసరం

గణపవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు తమ వృత్తి పట్ల అంకితభావం పెంచుకోవాలని ఎంపీడీవో సూర్యనారాయణ అన్నారు. గణపవరం ఎంపీడీవోగా పని చేస్తున్న ఆయన అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. కొయ్యలగూడెం ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.బేబి శ్రీలక్ష్మి ఇక్కడికొచ్చారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీవోలకు వీడ్కోలు, స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

భీమడోలు, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సంజీవరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు పాల్గొని నూతన కార్యవర్గం ఎంపిక, గ్రామ స్థాయిలో బలోపేతంపై సమీక్షించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

పెదవేగి, న్యూస్‌టుడే: స్థానిక దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో నూజివీడు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కేవీవీఎన్వీ ప్రసాద్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చింతమనేని మాట్లాడుతూ... గత వైకాపా పాలనలో పోలీసు వ్యవస్థపై నమ్మకం పోయిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో ప్రజల నుంచి నమ్మకం, గౌరవం పొందేలా పని చేయాలన్నారు. ప్రజలు శాంతియుతంగా జీవించేలా పాలన సాగించడమే లక్ష్యమన్నారు. తదనుగుణంగా పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని కోరారు.



ఎమ్మెల్యేకు మొక్క ఇస్తున్న నూజివీడు డీఎస్పీ ప్రసాద్

వినికిడి యంత్రాల పంపిణీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని బాలల సత్వర చికిత్సా కేంద్రంలో శుక్రవారం వినికిడి లోపమున్న బాలబాలికలకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. వీటిని స్వరూప ఛారిటబుల్ ట్రస్టు అందించింది. యంత్రాల పంపిణీ ప్రక్రియను సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ సుధాకర్ పర్యవేక్షించారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ, పిల్లల వైద్యులు శ్రీనివాసరావు, ఆల్బర్ట్, మేనేజర్ నరేశ్ పాల్గొన్నారు.

నూజివీడు ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నూజివీడు ఆర్డీవోగా ఎం.వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్డీవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.



కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న వాణి

పెదపాడు ఎంపీడీవోగా అమీల్‌జామ..

పెదపాడు: పెదపాడు ఎంపీడీవోగా మహమ్మద్ అమీల్‌జామ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అత్తిలి ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీపై ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని ఎంపీడీవో మర్యాదపూర్వకంగా కలిశారు.



డీటీగా పూర్ణచంద్రరావు..

ఉంగుటూరు: మండల ఉప తహసీల్దారుగా వై.పూర్ణచంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు కలెక్టరేట్ నుంచి బదిలీపై ఇక్కడికొచ్చారు. ప్రస్తుతం తహసీల్దారు పోస్టు ఖాళీగా ఉండటంతో.. ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులిచ్చారు. ఎన్నికల డీటీ పోతురాజు, ఆర్ఐ దావీదురాజు, వీఆర్వోలు ఆయనకు అభినందనలు తెలిపారు.

గాయత్రీ.. జగధాత్రి..

ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి వేడుకలు నయనానందకరంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం అమ్మవార్లు గాయత్రి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏలూరు సత్రంపాడులోని అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీదేవి, దత్తాశ్రమంలోని శ్రీనం దత్తనాథక్షేత్రం, పత్తేబాద, బావిశెట్టివారిపేట, హనుమాన్‌నగర్, 12 పంపుల సెంటరులోని కనకదుర్గమ్మ, దక్షిణపు వీధిలోని మహిషాసురమర్దిని, తంగెళ్లమూడి కాళిమాత ఆలయాల్లో విశేష పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ, పెదపాడు మండలం వట్లూరులోని కనకమహాలక్ష్మి ఆలయాల్లో అమ్మవార్లు గాయత్రిదేవిగా ఉభయమిచ్చారు. నిడమర్రు మండలం మందదలపర్రులోని ఉమా నీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రం, భీమడోలులోని పలు ఆలయాల్లో విశేష పూజాదికాలు చేయగా... తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు దర్శించి పూజలు చేశారు. ఉంగుటూరు మండలం కైకరం, ఉంగుటూరులో దసరా ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగాయి. **- న్యూస్‌టుడే బృందం**



ఏలూరు: సౌభాగ్యలక్ష్మీ



ఏలూరు: అంబికాదేవి



ఏలూరు: ధనలక్ష్మి రూపంలో..



కనకదుర్గమ్మ



కైకరంలో..



నిడమర్రు: గాయత్రీదేవి



పెదపాడు: రాట్నాలమ్మ

శ్రీనివాస్‌కు అభినందన

భీమడోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల సహకార ఆర్థిక సహకార సంఘం(ట్రైకార్) ఛైర్మన్‌గా బొరగం శ్రీనివాస్ విజయవాడలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు శుక్రవారం కలసి శాలువాతో సత్కరించి అభినందించారు.

18న ఇఫ్టూ రాష్ట్ర సదస్సు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 18న నిర్వహించే ఇఫ్టూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో... ఆ సంఘం ముద్రించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయకుండా ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని సీపీఎం నగర కార్యదర్శి పి.కిశోర్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ... కొందరు దళారీలు ఇసుకను నల్ల బజారులో యథేచ్ఛగా విక్రయిస్తున్నారని, వారి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు. నాయకులు బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు సునీతకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏలూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నిడమర్రు గ్రామీణం: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేశారు. పార్టీ మండల కన్వీనర్ నారాపల్లి రమణారావు నేతృత్వంలో తహసీల్దారు నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. వెంకట కృష్ణారావు నేతృత్వంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు నారపల్లి రమణరావు, సీరా అప్పారావు, కోట భాస్కరరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: నారాయణపురంలోని నిర్వహిస్తున్న జూద స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.47,900 స్వాధీనం చేసుకున్నట్లు చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ తెలిపారు.

స్పందించిన పోలీసులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలో జామకాయలు విక్రయించే 70 ఏళ్ల వృద్ధుడు శుక్రవారం మధ్యాహ్నం సొమ్మసిల్లి పడిపోయారు. మూడో పట్టణ పోలీసుస్టేషన్ సిబ్బంది గమనించి.. ఆయన్ను సర్వజన ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సకాలంలో స్పందించిన పోలీసులను స్థానికులు అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

భీమడోలు, న్యూస్‌టుడే: చోరీ కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు సీఐ విల్సన్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. స్థానిక కఠారి వీధిలో ఒంటరి మహిళ చల్లమరియ్యా నివాసం ఉంటున్నారు. ఆగస్టు 12న తణుకులోని బంధువుల ఇంటికి వెళ్లి 28న తిరిగొచ్చారు. ఇంటికి వచ్చి చూస్తే తాళం పగులగొట్టి ఉండటం, లోపల బీరువాలో ఉంచిన కాసు బంగారు వస్తువులు, 13 తులాల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భీమడోలుకు చెందిన పాత నేరస్థుడు కర్నాటి విజయకుమార్ అలియాస్ పాండా చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడ్ని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై సుధాకర్, కానిస్టేబుళ్లను అభినందించారు.

పోలవరం

•పోలవరం • చింతలపూడి

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఇఫ్టు జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఎంసీ వద్ద పౌర సరఫరాల, డీసీఎంఎస్ హమాలీల సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ టి.నరసాపురంలో ఆశా కార్యకర్తను విధుల నుంచి అన్యాయంగా తొలగించారన్నారు. కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. విజయవాడలో ఈ నెల 18న జరగనున్న కార్మిక సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. నాయకులు ముప్పిడి అబ్బులు, గంపల వెంకటేశ్, పొడిలోలు దుర్గారావు, ముప్పిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై అవగాహన

చింతలపూడి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సాంకేతిక, ఆర్థిక రంగాల్లో రాష్ట్రం ప్రపంచానికి దీటుగా ముందుకు సాగేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు.

దస్త్రాల పరిశీలన

పోలవరం, న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి క్షేత్ర స్థాయిలో పనులు, దస్త్రాల పరిశీలనకు వచ్చిన సూర్యచంద్ర, అశోక్‌లు శుక్రవారం ప్రగడపల్లి, జల్లెళ్లగూడెం పంచాయతీల్లో పర్యటించారు. సచివాలయాల వద్ద ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణ సంస్థ, వెలుగు, భూముల సర్వేకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు పత్రం అందజేస్తున్న సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమకూరింది. హైదరాబాద్ కొండాపూర్‌కి చెందిన ఎ.వరప్రసాద్ ఆ మొత్తాన్ని ఆలయ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం.. దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామి వారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రం అందజేశారు.

మాజీ కమిషనర్, టీపీఎస్‌లపై అభియోగాల నమోదు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణ ప్రణాళిక విభాగంలో అక్రమాలు, అతిక్రమణలకు సంబంధించి మాజీ కమిషనర్ శ్రావణ్‌కుమార్, అప్పటి టీపీఎస్ సత్యనారాయణబాజీపై అభియోగాలు నమోదు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019-2022 మధ్య శ్రావణ్‌కుమార్ కమిషనర్‌గా పనిచేశారు. ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా కావలిలో పని చేస్తున్నారు. జంగారెడ్డిగూడెంలో పనిచేసిన సమయంలో ఇష్టానుసారంగా అనధికార కట్టడాలు, నాన్ లేఅవుట్లలో భవనాలకు పెద్ద ఎత్తున అనుమతులు జారీ చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో 2022లో పురపాలక పాలకవర్గం కూడా ఆయనపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఏకంగా సమావేశంలో అతడి అవినీతిపై ఫ్లెక్సులు ప్రదర్శించారు. కలెక్టర్‌కు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రావణ్‌కుమార్ 2022 మే 19న దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. అనంతరం ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. సత్యనారాయణబాజీ టీపీఎస్‌గానే కాక ఇన్‌ఛార్జి టీపీవోగానూ ఉన్నారు. వీరిద్దరు అక్రమాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలోనే ఛార్జి మెమో జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి ఏకే సింఘాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత అధికారులపై విచారణ జరగనుంది.

బోర్ల తీగలు అపహరించారని ఫిర్యాదు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తమ పొలాల్లోని వ్యవసాయ బోర్లకు సంబంధించిన విద్యుత్తు తీగలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుని పోయారని ద్వారకాతిరుమల మండలం రామన్నగూడేనికి చెందిన రైతులు ముళ్లపూడి శ్రీను, ఈదల రామకృష్ణ, షేక్ సయ్యద్ బాజీ, ఘంటా రాంబాబులు ద్వారకాతిరుమల పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

హైవే పనులు.. మునుగుతున్న పంటలు!

గగ్గోలు పెడుతున్న రైతులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు రైతులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద తమ పొలాలను ముంచెత్తుతోందని జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి గ్రామ చిన్న సన్నకారు రైతులు వాపోతున్నారు. గ్రామ శివారులోని పొలాలను ఆనుకుని పుంత దారి ఉంది. వర్షాలు కురిసినప్పుడు వరద దాని గుండా ప్రవహించి సమీపంలో కొంగల చెరువులో కలుస్తుంది. ప్రస్తుతం ఈ పుంతను చీల్చుతూ హైవే నిర్మాణ పనులు జరిగాయి.



దేవులపల్లి శివారులో ఆయిల్‌పామ్ తోటలో వరద (పాత చిత్రం)



కంపెనీ పుంత దారిలో కాకుండా వేరే చోట చిన్నపాటి తూము ఏర్పాటు చేశారని చూపుతున్న రైతులు

సమస్య లేకుండా చూస్తామని చెప్పి..

గతంలో హైవే నిర్మాణ అధికారులకు వరద పరిస్థితి గురించి వివరించాం.. సమస్య లేకుండా తూము ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ అది కార్యరూపం దాల్చకపోగా పుంతకు సంబంధం లేని చోట చిన్నపాటి తూము ఏర్పాటు చేశారని రైతులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద సమీపంలోని 50 ఎకరాల్లోని పంటలను ముంచెత్తి నష్టం చేకూర్చింది. దీంతో వర్షం పడినప్పుడల్లా ఆందోళన చెందాల్సి వస్తోందని రైతులు దాసరి సురేశ్, చవల శ్రీరామూర్తి, ముమ్మిడి రాజు, మద్దూప్పు సత్తిబాబు, మైరెడ్డి త్రిమూర్తులు, మద్దూప్పు రాంబాబు, హనుమంతు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు నష్టం వాటిల్లకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

అంతా నీటిపాలైంది

'వ్యవసాయమే జీవనాధారం. 10 ఎకరాల్లో పంటలు వేశా. ఇటీవల వర్షాలకు వచ్చిన వరద మా ఆయిల్‌పామ్ తోటలో మోకాలి లోతులో ప్రవహించింది. బిందు సేద్య పరికరాలు కొట్టుకుపోయాయి. ఆ ముందురోజే రూ.50 వేలు విలువైన ఎరువులు చల్లా. అంతా నీటిపాలైంది' అని రైతు మానికల సుబ్బారావు తెలిపారు.

ఆరోగ్యం పాడైంది

'మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నా. ఇటీవల కురిసిన వర్షాలకు వరద మా పంటలను తుడిచిపెట్టేసింది. తోటలో భారీగా ఇసుక మేటలు వేశాయి. గతేడాది సైతం ఇలాగే జరగడంతో వరి పంట మునిగి పూర్తిగా నష్టపోయా. ఆందోళనతో ఆరోగ్యం పాడైంది' అని దాసరి వెంకటేశ్వరరావు వాపోయారు.

వణికిస్తున్న వారధి



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రాజవరం సమీపంలోని ఎర్ర కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి రెండు చోట్ల కుంగింది. ఆ ప్రాంతంలో రహదారి భాగం కిందికి కుంగుతుండగా మిగిలిన భాగం ఉబ్బెత్తుగా తయారై వేగ నిరోధకంలా తయారైంది. దీన్ని ప్రయాణికులు గమనించక పోవడంతో అదుపు తప్పి పడిపోతున్నారు. కొన్నేళ్ల కిందట వంతెన కింది భాగంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు పేర్కొంటున్నారు. వంతెన పరిస్థితిని వివరిస్తూ గత వైకాపా ప్రభుత్వంలో మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ స్పందన రాలేదని సమాచారం. ఈ విషయమై ర.భ.శాఖ జంగారెడ్డిగూడెం డీఈఈ హరికృష్ణ మాట్లాడుతూ వంతెనపై రహదారి కుంగుతున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. అనుమతులు రాగానే మరమ్మతులు చేపడతామన్నారు.

నిర్వాసితుల జీవన విధానంలో మార్పునకు కృషి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త కరుణశ్రీ

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల జీవన విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మొక్కలతో పాటు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామని కేంద్రీయ విద్యాలయ శాస్త్రవేత్త కరుణశ్రీ అన్నారు. పోలవరం మండలం కొండ్రుకోట పునరావాస కాలనీ రైతు సేవా కేంద్రంలో సర్పంచి పైదా నాగరాజు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో అన్ని రకాల కూరగాయాలు, పంటలు పండించే గిరిజనులు.. అక్కడి నుంచి బయటకు వచ్చాక కొనుక్కునే పరిస్థితికి వచ్చారన్నారు. పునరావాస కాలనీల్లో ఉన్న కొద్దిపాటి స్థలంలో అవసరమైన మొక్కలు పెంచేలా కేంద్రీయ విద్యాలయ ఉద్యానవనం నుంచి సహకారం అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా 250 కుటుంబాలకు 12 రకాల పెరటి మొక్కలకు సంబంధించిన విత్తనాలు అందజేశారు.

తప్పుడు బిల్లులు చేసుకుంటున్నారంటూ ఆందోళన

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెం పంచాయతీ అక్రమాలపై అధికారులు విచారణకు ఆదేశించినా, ఇంకా తప్పుడు బిల్లులు తయారు చేస్తూ, దస్త్రాలు తారుమారు చేస్తున్నారంటూ స్థానిక యువకులు ఆందోళనకు దిగారు. ఇటీవల సామాజిక కార్యకర్త పాండురంగ ఆరోపణలతో ఆ పంచాయతీలో జరుగుతున్న అవకతవకలపై 'ఈనాడు, ఈటీవీ'లలో కథనాలు ప్రచురితమయ్యాయి. వాటిపై స్పందించిన అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో పంచాయతీ కార్యదర్శి కూడా బదిలీ ప్రయత్నంలో ఉన్నారు. 10 రోజులుగా రాత్రి పొద్దు పోయే వరకు సచివాలయంలో సంబంధం లేని వ్యక్తులు ఉండి, వారికి అవసరం అయిన బిల్లులు తయారు చేసుకుంటున్నారని స్థానిక యువకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి యువకులు వారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల వారి మధ్య గొడవ జరిగింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పి అక్కడి నుంచి పంపేశారు.



గాయత్రీదేవి అలంకరణలో జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ



గురవాయిగూడెంలో...



ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ

గాయత్రీ మాతా.. శరణు.. శరణు..!


దేవీ నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ చేశారు. - న్యూస్‌టుడే, బృందం



నరసన్నపాలెం కూడలిలో..



జీలుగుమిల్లి జగదాంబ అమ్మవారు



పేరంపేట రోడ్డు లక్ష్మీ గణపతి ఆలయం వద్ద భక్తుల పూజలు



పశువైద్యశాల భవనం


పశు వైద్యం దైవాధీనం



గోడలు విరిగిన నీటి తొట్టె

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: యర్రంపేట పశువుల ఆసుపత్రి భవనం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. చుట్టూ ప్రహరీ లేక పరిసరాలను మందుబాబులు పాడు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టె గోడలు విరిగి పాడైంది. ఆసుపత్రికి నీటి వసతి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యాధికారి అపూర్వ మాట్లాడుతూ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

పురపాలక కమిషనర్‌గా కేవీ రమణ



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పురపాలక కమిషనర్‌గా కొమ్మినేని వెంకట రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదే పురపాలక సంఘంలో మేనేజరుగా చేస్తూ పదోన్నతిపై కమిషనర్‌గా నియమితులయ్యారు. జంగారెడ్డిగూడెం హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన దుర్గాప్రసాద్ విధుల్లో చేరారు.

ఎంపీడీవోలుగా బాధ్యతల స్వీకరణ

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి ఎంపీడీవోగా వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం ఎంపీడీవోగా కుంజా జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఆమె వీరవాసరం నుంచి బదిలీపై వచ్చారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం ఎంపీడీవోగా ఎస్.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ★ డీటీగా టి.సత్యసాయిబాబా బాధ్యతలు స్వీకరించారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం ఎంపీడీవోగా కె.కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ★ ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారిగా కె.శ్రీనివాస్, పరింపూడి పంచాయతీ కార్యదర్శిగా కె.సురేష్, కన్నాపురం ఎల్.రవికుమార్, యర్రంపేట కార్యదర్శిగా బి.చినకుమారి బాధ్యతలు చేపట్టారు.

తనిఖీ కేంద్రం ఎఫ్ఎస్‌వోగా రాంబాబు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లిలోని అటవీ శాఖ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం ఎఫ్ఎస్‌వోగా కురసం రాంబాబు బాధ్యతలు స్వీకరించారు.

అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలును గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి విరగ్గొట్టారు. ఈ విషయాన్ని స్థానికులు శుక్రవారం ఉదయం గుర్తించారు. ఈ ఘటనపై దళిత, గిరిజన సంఘాల నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కావాలని ఈ ఘటనకు పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. విగ్రహం వద్ద కొద్ది సేపు ఆందోళన చేశారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ డిమాండ్ చేశారు. దీనిపై పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అంబేడ్కర్ విగ్రహాన్ని డీఎస్పీ రవిచంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. కారకులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామన్నారు. వేలు ధ్వంసమైన ప్రాంతంలో మరో వేలును అమర్చి బాగు చేయించారు. ఆయా సంఘాల నాయకులు తొర్లపాటి శ్రీనివాస్, మొడియం శ్రీనివాస్, కాటం డేవిడ్, వెంపా ఐజక్, సుందరరావు, జి.నాగు, పంతగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేరు మారినా.. తీరు మారదా?

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ పేరును ప్రతిఫలించేలా డ్వాక్రా సంఘాల కార్యాలయం పేరును వైఎస్ఆర్‌క్రాంతిపథం (వైసీపీ) మండల సమాఖ్య కార్యాలయంగా వ్యవహరించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారినా ఇప్పటికీ అదే పేరు కొనసాగుతుండడం గమనార్హం. అలాగే రైతుభరోసా కేంద్రాలను సేవాకేంద్రాలుగా వ్యవహరిస్తున్నప్పటికీ సంబంధిత యంత్రాంగంలో ఇంకా కదలిక రాలేదు. మండలంలోని పలు ఆర్బీకేల పేర్లను యథాతథంగానే కొనసాగిస్తూ ఉండడం గమనార్హం.



కొయ్యలగూడెం మండల సమాఖ్య కార్యాలయంపై పాత పేరు

సూపర్ సిక్స్ పథకాల అమలు కోరుతూ ధర్నా



జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద..

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అందరికీ ఉచిత ఇసుక ఇవ్వడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఇసుక సరఫరా లేక గృహ నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేదన్నారు. నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని కోరారు. నాయకులు ఎం.జీవరత్నం, పి.సూర్యారావు, సుభాషిణి, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉందని భవన నిర్మాణ కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐ రంగమ్మకు వినతిపత్రం అందజేశారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక వాగ్దానం అమలు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోరుతూ ద్వారకాతిరుమలలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నాయకులు ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక పేరుతో ధరల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ మణిదివ్యకు అందజేశారు. కార్యక్రమంలో శుక్లబోయిన రాంబాబు, చెల్లారి నాగరాజు, ఎం.సతీష్, ఇళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుట్టాయగూడెం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కుంజా గంగరాజుకు వినతిపత్రం అందజేశారు. తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, అందుగుల ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు, న్యూస్‌టుడే: పేరుకే కాకుండా వాస్తవ రూపంలోనూ ఇసుకను ఉచితంగా అందజేయాలని కోరుతూ సీపీఎం అనుబంధ భవన నిర్మాణ రంగ కూలీలు కుక్కునూరులో ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగేంద్రరావు, లక్ష్మయ్య, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నరు.

చికిత్స పొందుతూ మృతి

లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం మఠంగూడేనికి చెందిన గద్దే గోపాలం(40) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 2న భరించలేని నొప్పి రావడంతో ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం కొత్తనూతనగూడెం ఏటిగట్టుపై వేగ నిరోధకం వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన మార్తమ్మ, దేవి అనే మహిళలు శుక్రవారం పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా ఏటిగట్టుపై వేగ నిరోధకం వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటో కుదుపునకు గురైంది. ఆ సమయంలో ఆటోలోని ఇనుప రాడ్ తగలడంతో మార్తమ్మ, దేవి తలలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని పోలవరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

హిజ్రాల అసభ్య ప్రవర్తనతో బెంబేలు

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: కామవరపుకోట శివారు కొత్తూరు వద్ద ఓ దుకాణదారుడికి శుక్రవారం హిజ్రాల నుంచి చేదు అనుభవం ఎదురైంది. దసరా పండగ పేరు చెప్పి ఐదుగురు హిజ్రాలు దుకాణం వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని కోరారు. దుకాణదారుడు రూ.50 ఇవ్వడంతో.. తమకు ఇంకా కావాలంటూ గొడవకు దిగారు. దుకాణదారుడు నిరాకరించడంతో శాపనార్థాలు పెట్టడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించి నానా బీభత్సం చేసి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఘర్షణను దుకాణదారుడు తన చరవాణిలో చిత్రీకరించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతున్నాయి. బలవంతపు వసూళ్లకు పాల్పడి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపారు..

ఎనిమిది కిలోమీటర్లు.. అరగంట సమయం!



చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి-టి.నరసాపురం ప్రధాన రహదారి సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర గోతులతో అధ్వానంగా మారింది. ఈ కారణంగా ప్రయాణ సమయం అరగంటపైనే పడుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బొర్రంపాలెంలో పాము కాటుకు గురైన బాలుడిని చింతలపూడి తీసుకొస్తుండగా గుంతల రోడ్డులో ఆలస్యం కావడంతో మృతిచెందాడని వాహన చోదకులు చెబుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. వర్షం కురిస్తే మరింత ప్రమాదకరంగా ఉంటోందంటున్నారు.

మరమ్మతులు చేస్తాం.. 'చింతలపూడి-టి.నరసాపురం రహదారి మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు చేపడతాము' అని చింతలపూడి ఆర్అండ్‌బీ ఏఈ, సుందరరావు తెలిపారు.

గ్రామ రెవెన్యూ అధికారుల నియామకం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణంలోని కొన్ని సచివాలయాలకు కొత్త గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) నియమితులయ్యారు. కేతవరానికి కె.రమేశ్, చక్రదేవరపల్లి పి.రవికుమార్, మైసన్నగూడెం పి.సురేశ్, టెక్కినవారిగూడెం ఎస్.బాలస్వామి, వేగవరం-2 ఎన్.అనుపమకుమారి, ఎ.పోలవరం సీహెచ్ చెన్నకేశవరావు, ఎ.పోలవరం తగరం రవి, తాడువాయి-1 పి.నాగరాజు, తాడువాయి-2 తెల్లం రాజశేఖర్, జంగారెడ్డిగూడెం-1వ సచివాలయం వీఆర్వోగా ఎస్కే బాజీ నియమితులయ్యారు. వారంతా శుక్రవారం విధుల్లో చేరారు.

వృద్ధులకు వితరణ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: బాపూజీ వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పట్టణంలోని సుమారు 100 మంది వృద్ధులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు.

అక్కరకు రాని సూచిక బోర్డులెందుకో..?

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: ఇప్పటికే జీలుగుమిల్లి వద్ద రెండు కిలోమీటర్ల మేర బాగున్న రహదారిని తవ్వేసి గుంతలు మిగిల్చిన జాతీయ రహదారుల సంస్థ అధికారులు.. మరో అక్కరకు రాని పనితో విమర్శలకు గురవుతున్నారు. జీలుగుమిల్లిలో రాష్ట్ర సరిహద్దు నుంచి పోలవరం మీదుగా కొవ్వూరు వరకు 365బీబీ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. అయిదేళ్ల కిందట ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న దీన్ని జాతీయ రహదారిగా ప్రకటించారు. నాలుగేళ్ల కిందట జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం వరకు ఒక వరుస మార్గం నిర్మించారు. అప్పటి నుంచి పలుమార్లు గోతులకు మరమ్మతులు చేపట్టిన అధికారులు.. వాహన చోదకులకు అవగాహన కల్పించే, అప్రమత్తం చేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు.

కొత్తవి ఎందుకో?

మూడు నెలల కిందట జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకు రహదారి విస్తరణ సర్వే పనులు చేపట్టారు. ముందుగా రహదారికి ఇరువైపులా హద్దు రాళ్లు పాతించారు. ఆయా గ్రామాల్లో విస్తరణలో పోతున్న భవనాలు, వ్యవసాయ భూముల వివరాలు నమోదు చేశారు. ఒకవైపు విస్తరణ పనులు వేగవంతం కావడం, మరోవైపు సర్వే చేసి రహదారిపై గుర్తులు ఏర్పాటు చేస్తుండగా.. అధికారులు మాత్రం కొత్తగా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



రెడ్డిగణపవరం వద్ద పాతది ఉండగా పక్కనే ఏర్పాటు చేసిన మరో బోర్డు



జాతీయ రహదారి విస్తరణకు సర్వే చేసి గుర్తులు వేస్తున్న సిబ్బంది

ఇప్పటికే ఉన్న దాని పక్కనే మరొకటి

బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం వద్ద ఆ గ్రామ పేరు తెలిపే బోర్డు ఇప్పటికే ఉండగా దాని పక్కనే మరొకటి ఏర్పాటు చేశారు. విస్తరణ పనుల్లో రహదారిని తవ్వేసే అవకాశం ఉండగా వాగులు, కల్వర్టులు, మలుపులు, గ్రామాలు ఇలా ప్రతి చోటా వేలాది బోర్డులు పెట్టడం ఎందుతో తెలియడం లేదు. అతి తక్కువ కాలంలోనే వాటిని తీసేసే పరిస్థితి ఉంటుంది. దీంతో పనిభారం పెరగడంతో పాటు రూ.లక్షలు విలువ చేసే బోర్డులు పనికిరాకుండా పోతాయి. దీనిపై ఎన్‌హెచ్ ఏఈ ఖాజా మాట్లాడుతూ గతేడాది బోర్డులు మంజూరు కాగా పనులు ఆలస్యం కావడంతో ప్రస్తుతం ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో పెట్టామని, విస్తరణ పనుల్లో వాటిని తొలగించి మరలా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించండి

మండవల్లి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను గ్రామాల్లో గొడవలకు తావు లేకుండా శాంతియుతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు కృషి చేయాలని మండవల్లి ఎస్సై రామచంద్రరావు సూచించారు. మండవల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయా గ్రామాల్లోని ఉత్సవ నిర్వాహక కమిటీలతో సమావేశం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలకు అన్ని అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు.


కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై రామచంద్రరావు

దివ్యాంగుల వికాసానికి దాతల సాయం అభినందనీయం



ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: వివిధ కారణాలతో శరీర అవయవాలు కోల్పోయిన వారికి దాతల సాయం అభినందనీయమని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విశ్రాంత ఆచార్యులు ఉప్పలపాటి మణికుమారి అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో అమెరికాకు చెందిన డా.ఇమ్మడి రామకృష్ణ జీవిత మరణించారు. ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందించిన నిధులతో నలుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేశారు. కార్యక్రమంలో హీల్ ప్రతినిధులు తాతినేని లక్ష్మి, అజయ్‌కుమార్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణ పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప కేంద్రం ఏఈ సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినికిడి యంత్రాల పంపిణీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని బాలల సత్వర చికిత్సా కేంద్రంలో శుక్రవారం వినికిడి లోపమున్న బాలబాలికలకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. వీటిని స్వరూప చారిటబుల్ ట్రస్టు అందించింది. యంత్రాల పంపిణీ ప్రక్రియను సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ సుధాకర్ పర్యవేక్షించారు. జిల్లా ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ, పిల్లల వైద్యులు శ్రీనివాసరావు, ఆల్బర్ట్, మేనేజర్ నరేశ్ పాల్గొన్నారు.

☛ సెలవుల సమయంలో రెండేళ్ల కిందట నూజివీడు పట్టణంలో ఓ ఇంట్లో దొంగలు పడి 10 కాసుల బంగారం, రూ.50 వేల నగదు చోరీ చేశారు.

☛ మూడు నెలల కిందట నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఓ కుటుంబం తాళం వేసి ఊరెళ్లారు. అక్కడ రూ.లక్ష విలువైన బంగారం, వెండి, రూ.15 వేల నగదు అపహరించారు.

☛ ఏడాది కిందట ఆగిరిపల్లిలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి రూ.50 వేల నగదు, రూ.లక్ష విలువైన బంగారం, వెండి వస్తువులు అపహరించుకుపోయారు.

సెలవుల్లో ఇల్లు జాగ్రత్త!



• తాళాలు వేసినవే లక్ష్యంగా చోరీలు • నివారణ ధ్యేయంగా అందుబాటులో యాప్

నూజివీడు, న్యూస్‌టుడే: దసరా సెలవులు వచ్చేశాయి. విహార యాత్రలు, సొంతూళ్లు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారా..? అయితే జర జాగ్రత్త. ఇదే అదనుగా దొంగలు కూడా మాటు వేసి ఉన్నారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో దసరా పండగకు పలు ఇళ్లలో చోరీలు జరిగిన ఘటనలున్నాయి. నగదు, విలువైన బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడంతో కొందరు తీవ్రంగా నష్టపోయారు.

సాంకేతిక పరిజ్ఞానంతో..

లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్.. సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్లల్లో దొంగతనాల్ని అడ్డుకునే దుకు ఉద్దేశించిన వ్యవస్థ. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పోలీసు శాఖ దీన్ని అందుబాటులోకి తెచ్చింది. అన్ని పట్టణాల్లో అమలు చేస్తున్నారు. ఇంటిని విడిచి కొన్ని రోజుల పాటు దూరంగా ఉండేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే వారు ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి దాంతో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను అనుసంధానం చేస్తారు. తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు ఎవరైనా తెరిచినా.. చోరీ అవకాశ మున్నా వెంటనే ఆ యాప్ పోలీసులను అప్రమత్తం చేస్తుంది. దీంతో వారు అక్కడికి చేరేలా చేస్తుంది. ఈ యాప్‌ను సెలవుల్లో ఎక్కువ మంది వినియోగించుకోవడం ద్వారా ఇంటిని భద్రంగా ఉంచుకోవచ్చు.


ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ముఖ చిత్రం

ప్రజలకు భరోసా..

చోరీల నివారణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వీధుల్లో ఎవరైనా అనుమానంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. చోరీల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

- పి.సత్యశ్రీనివాస్, కె.రామకృష్ణ నూజివీడు పట్టణ, గ్రామీణ సీఐలు

రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరుకు వచ్చిన వరద దాటికి ధ్వంసమైన రోడ్ల స్థానంలో నూతన రోడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కలెక్టర్ వెట్రిసెల్విని కోరారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం తెదేపా వడ్డి సాధికార రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు, కొల్లేరు సంఘం నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టరుకు వినతిపత్రం అందించారు. కైకలూరు, మండవల్లి మండలాల్లో రాపోకలు సాగించే మార్గం లేక అవస్థలు పడుతున్నారని మారిన రోడ్ల చిత్రాలను కలెక్టరుకు చూపించారు. ఆలపాడు- కొల్లేటికోట ప్రధాన రోడ్డు, గోకర్ణపురం- పైడి చింతపాడు మార్గం, మండవల్లి మండలం పెదఎడ్లగాడి, ఇంగిలిపాకలంక, మణుగునూరు- పెనుమాకలంక ప్రధాన మార్గాలను తర్వితగతిన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టరు సానుకూలంగా స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారని ఏసురాజు తెలిపారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు కామినేని, ధర్మరాజు, నాయకులు

అంబేడ్కర్ భవన నిర్మాణానికి అనుమతి ఇప్పించాలంటూ..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలోని అంబేడ్కర్ నగర్, కాలనీ మధ్యలో ఉన్న పంచాయతీ స్థలంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి అనుమతి ఇప్పించాలని కోరుతూ జై భీమ్ భవన నిర్మాణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు వినతిపత్రాలు అందించారు. నలభై ఏళ్ల కిందట ఆ స్థలంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి సంకల్పించారన్నారు. ఇప్పటికైనా స్పందించి భవన నిర్మాణానికి సహకరించాలన్నారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రామకృష్ణ, పర్యాటక అభివృద్ధి శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్‌బాబు, ఎస్సీసెల్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సేవా నాగజగన్‌బాబురావు, ఉపాధ్యక్షుడు లేళ్ల ప్రసాద్, యూత్ అధ్యక్షుడు మేడిపాటి జగదీశ్‌బాబు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పన లక్ష్యంగా జాబ్ మేళా

కైకలూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కార్యాలయం, జవహర్ నాలెడ్జ్ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రిలయన్స్ డిజిటల్ లిమిటెడ్, అరబిందో ఫార్మ, ఇన్నోవా సోర్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, వరుణ్ మోటార్స్ వంటి 8 కంపెనీలతో జాబ్ మేళా ఏర్పాటు చేశారు. దీనికి 236 మంది నిరుద్యోగులు హాజరు కాగా 52 మంది పలు కంపెనీల్లో ఉపాధి పొందినట్లు తెలిపారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. కె.ప్రవీణ్, సురేశ్, ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగ నియామకపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ సుజాత, సంస్థల ప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

నూజివీడు :	99486 40551	కైకలూరు :	73060 88555
ముసునూరు :	93983 81268	కలిదిండి :	90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చెత్త పేరుకుపోయింది. - రవి, నూజివీడు

సమాధానం: చెత్త తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - నాగరాజు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

చాట్రాయి, న్యూస్‌టుడే

సమస్య: చనుబండలో కొర్లమంద రోడ్డులో గోతుల్లో నీరు నిలిచాయి. అటుగా నడిచేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - జోగు మహేష్, చనుబండ

సమాధానం: వర్షాలతో రహదారులపై పడిన గుంతలను పూడ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. - సీహెచ్.బాబూరావు, డీఈ, ర.భ.శాఖ, నూజివీడు

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: గోపవరంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. - కె.శ్రీనివాసరావు, స్థానికుడు

సమాధానం: కుక్కలకు కు.ని. శస్త్ర చికిత్సలు చేయిస్తాం. - ఆర్.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని వరహాపట్నంలో పంచాయతీ రక్షిత తాగునీటి పథకం పక్కన సిమెంటు రోడ్డుపై డ్రెయినేజీ మురుగు నీరు ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు అవస్థలు పడుతున్నారు. - కుమార్, వరహాపట్నం

సమాధానం: వెంటనే మురుగు తొలగించేలా చర్యలు తీసుకుని పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తాం. - శివన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి



దారి దారుణంగా మారి!

మండవల్లి ప్రధాన రహదారి వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దారుణంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగడంతో మండవల్లి మండల కేంద్రంలో రోడ్డు తటాకాలను తలపిస్తున్నాయి. గోతుల్లో నీరు చేరడంతో ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ రోడ్డు ఉందో అర్థంకాక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మండవల్లి ఇండియన్ బ్యాంక్, కైకలూరు సంత వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. - న్యూస్‌టుడే, మండవల్లి

రుణాలు సకాలంలో చెల్లించాలి

ముసునూరు, న్యూస్‌టుడే: శ్రీనిధి కింద తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించేలా చూడాలని ఏపీఎం ఇ.రాంబాబు అన్నారు. శుక్రవారం ముసునూరు వెలుగు కార్యాలయంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు డి.పద్మావతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామైఖ్య, మండల సమాఖ్య సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలతో వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలన్నారు.


మాట్లాడుతున్న రాంబాబు

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

పెదవేగి, న్యూస్‌టుడే: స్థానిక దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో నూజివీడు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కేవీవీఎన్వీ ప్రసాద్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చింతమనేని మాట్లాడుతూ... గత వైకాపా పాలనలో పోలీసు వ్యవస్థపై నమ్మకం పోయిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో ప్రజల నుంచి నమ్మకం, గౌరవం పొందేలా పని చేయాలన్నారు. ప్రజలు శాంతియుతంగా జీవించేలా పాలన సాగించడమే లక్ష్యమన్నారు. తదనుగుణంగా పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చాట్రాయి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు చిత్తూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి పారేపల్లి మధుకల్యాణ్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 5-7 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో కృష్ణా జిల్లా జట్టులో విద్యార్థి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.


ఎంపికైన విద్యార్థితో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్

సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. శుక్రవారం నూజివీడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా వివిధ పంచాయతీల్లో మంజూరైన రహదారులు, మురుగు కాలువలకు సంబంధించిన వివరాలను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఉద్యానవన శాఖ పరిధిలో రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పంట ప్రోత్సాహకాల గురించి ఉద్యాన శాఖాధికారిణి ఆర్.హేమ వివరించారు. ఎంపీడీవో రామచేంద్రనాథ్, జడ్పీ వైస్ ఛైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు, మండల ఉపాధ్యక్షురాలు దుండుబోయిన స్వర్ణలత, ఇన్‌ఛార్జి తహసీల్దార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వైద్యులు రాక.. ఇన్‌ఛార్జులు లేక!

మండవల్లి ఆరోగ్య కేంద్రంలో ఇదీ పరిస్థితి

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత తీరడం లేదు. ఆగస్టు నుంచి ఇక్కడ రెగ్యులర్‌గా పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు ఒకరు సెలవులో వెళ్లగా మరొకరు ఉద్యోగానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇతర ఆరోగ్య కేంద్రాల వైద్యులను ఇన్‌ఛార్జులుగా నియమిస్తున్నా.. పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. వారం రోజులుగా ఇన్‌ఛార్జి వైద్యులు సైతం అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆరోగ్య కేంద్రం పరిధిలో 16 గ్రామాల్లోని 25 వేల మంది ప్రజలు సేవలు పొందుతున్నారు. గతంలో 12 గంటలు పని చేసే ఆసుపత్రిని 24 గంటలు పనిచేసేలా ఉన్నతి కల్పించి ఇద్దరు వైద్యులను నియమించారు. ఇప్పుడు కనీసం 12 గంటలు తరచూ రోగాల బారిన పడుతున్నారు. నిత్యం వందలాది మంది రోగులు ఆసుపత్రులకు వచ్చి తీరా వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రులు అధిక ఫీజులు దండుకుంటున్నాయి. స్తోమత లేని వారు మాత్రం ఆసుపత్రిలోని నర్సులు ఇచ్చే మందులతోనే కాలాన్ని వెళ్లదీస్తున్నారు.


ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

సైతం సక్రమంగా పని చేయకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులే దిక్కు

ఇటీవల కొల్లేరుకు భారీగా వరద వచ్చి చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో గ్రామస్థులు

ఉన్నతాధికారులకు నివేదించాం

మండవల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో ఇన్‌ఛార్జులను నియమించాం.. కానీ కొన్ని రోజులుగా ఇన్‌ఛార్జులు సైతం మండవల్లిలో పనిచేయడని చెబుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. - శర్మిష్ఠ, డీఎంహెచ్‌వో ఏలూరు

పోషకాహార కిట్లు అందజేత

మండవల్లి, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడంతో ఆరోగ్య సుభిక్షంగా ఉంటుందని మండవల్లి సర్పంచి ఎం.యూన్స్ అన్నారు. ఐసీడీఎస్ అధికారులతో కలిసి మండవల్లి 5, 6 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం లబ్ధిదారులకు పోషకాహార కిట్లు అందించారు. ఎం.సురేష్, జి.యూన్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంకాలు బహూకరణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి తాడేపల్లి చొప్పరమెట్లకు చెందిన ప్రత్తిపాటి సురేశ్‌బాబు తన తల్లి ప్రత్తిపాటి రత్నకుమారి జ్ఞాపకార్థం 20 పంకాలను శుక్రవారం బహూకరించినట్లు ఆలయ ఈవో డి.సురేశ్‌బాబు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నూజివీడు ఆర్డీవోగా ఎం.వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్డీవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.


కలెక్టర్ వెట్రిసెల్వికి మొక్క ఇస్తున్న వాణి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు డీఎస్పీగా కేవీవీఎన్వీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. ఇక్కడ పని చేసిన డీఎస్పీ లక్ష్మయ్య సాధారణ బదిలీలో భాగంగా సీఐడీ విభాగానికి వెళ్లారు.



ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి ఎంపీడీవోగా యద్దనపూడి రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాముర్రు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఏవోగా ఎమ్.రమణారావు పెదపారుపూడి మండలం నుంచి ఈవోపీఆర్డీగా బి.ఆశోక్‌బాబు లింగాలపల్లి నుంచి, అబ్దుల్ పాషా పంచాయతీ రాజ్ ఏఈ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.


ఎంపీడీవో రామకృష్ణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలంలో శుక్రవారం పలువురు బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. ఈవోపీఆర్డీగా బి.ఆనంద్‌బాబు, పీఆర్ ఏఈగా ఎన్.నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్‌గా సీహెచ్.సుబ్బారావు బాధ్యతలు స్వీకరించినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో తెలిపారు.


ఈవోపీఆర్డీ ఆనంద్‌బాబు

ఈవోపీఆర్డీ బదిలీ

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాస్ శుక్రవారం బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో పనిచేసిన కలిదిండి శాఖ మండలానికి బదిలీపై వెళ్లారు.

ముగ్గురిపై తేనె టీగల దాడి

నూజివీడు, న్యూస్‌టుడే: ముగ్గురు వ్యక్తులపై తేనె టీగలు దాడి చేసిన ఘటన నూజివీడు మండలం వెంకటాయపాలెంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. వెంకటాయపాలెంలో పొలం దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ డ్రైవర్గా ఆగిరిపల్లి మండలం ఈదరకు చెందిన దొండపాటి కోటేశ్వరరావు వెళ్లారు. అక్కడ పొలం దుక్కి దున్నుతున్న క్రమంలో తేనెటీగలు కోటేశ్వరరావుపై దాడి చేశాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న వెంకటాయపాలెంకి చెందిన ఏసోబు, బెంజిమన్‌లపై కూడా తేనెటీగలు దాడి చేయడంతో పక్క పొలంలో పనిచేస్తున్న కూలీలు గమనించి వారిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు.


కోరుకొల్లు పాలెంరోడ్డులో..


మండవల్లిలో..


అల్లూరులో..


కైకలూరు: ధనలక్ష్మీదేవిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు


ముసునూరులో..


నూజివీడు: గాయత్రీ దేవిగా..

జయహో.. జగజ్జననీ

న్యూస్‌టుడే బృందం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. కలిదిండి మండలం కోరుకొల్లు పాలెంరోడ్డులోని శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మండవల్లి మండలం శోభనాద్రిపురం సుందరమల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. లోకుమూడి దత్తాశ్రమంలో పూజలు నిర్వహించారు. మండవల్లి భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నూజివీడు పట్టణంలోని కోట మహిషాసురమర్దని అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. ముసునూరు మండలం బలివేలో రాజరాజేశ్వరీ అమ్మవారిని లలిత త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఆగిరిపల్లిలోని వరాహ పుష్కరిణి-రుద్రభూమి మహిషాసురమర్దని ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. గురజ, పెదపాలపర్రు ఆంజనేయస్వామి ఆలయంలో పెద్దేశ్వరి ఇనకదుర్గమ్మ ఆలయంలో బాలా త్రిపుర సుందరీదేవిగా, ముదినేపల్లి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితాదేవిగా, దేవపుడిలో విజయదుర్గా, ఆలయంలో రేణుకాఎల్లమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కైకలూరు శ్యామలాంబ, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లను ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.


ఆగిరిపల్లిలో..


కలిదిండి: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

హామీలు అమలు చేయాలని ఆందోళన

కలిదిండి, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి శేషుబాబు, మహంకాళిరావు, వి.భాస్కరరావు, డీవీ సత్యనారాయణ, అబ్దుల్ అక్బర్ పాల్గొన్నారు. ● నూజివీడు చిన్న గాంధీ బొమ్మ కూడలిలో, తహసీల్దారు కార్యాలయం దగ్గర నిరసన తెలిపి వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి జి.రాజు తదితరులు పాల్గొన్నారు. ● ఆగిరిపల్లి తహసీల్దారు కార్యాలయం దగ్గర నిరసన తెలిపి, తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు నాగరాజు, ముత్యాల నరేశ్, సత్తు కోటేశ్వరరావు పాల్గొన్నారు. ● సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రాజు ఆధ్వర్యంలో ముసునూరు తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ దీపికకు వినతి అందజేశారు. కంచర్ల దుర్గారావు, కోనేరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి తుప్పు!

వరుసగా నిలిపి ఉన్న ఈ వాహనాలు ఏదో సినిమా హాల్లోనో, బస్టాండ్ వద్దో పార్కింగ్ చేసిన వాహనాలు అనుకుంటే మీరు పొరబడినట్లే. కరోనా లాక్‌డౌన్ సమయంలో



మద్యం అక్రమ రవాణా దారుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు ఇవి. చాట్రాయి పోలీస్ స్టేషన్ ఎదుట తుప్పు పడుతూ దర్శనమిస్తున్నాయి. వేలం ద్వారా వాటిని విక్రయించి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలి. కానీ చాలా కాలంగా మూలన పడేయడంతో తుప్పు పట్టి కుచిస్తున్నాయి. ముగ్గురు ఎస్సైలు మారినా వీటికి మాత్రం మోక్షం లభించడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఈ విషయమై ఎస్సై డి.రామకృష్ణ మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, చాట్రాయి

ఆలయం ఎదుట అగాధం!

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోలవరం-మద్దలపాలెం రహదారిలో శివాలయం ఎదురుగా పడిన గొయ్యి ఆగాధంగా మారింది. ఆలయానికి రాకపోకలు సాగించే భక్తులు, ఇటు వాహనదారులకు ప్రాణాంతకంగా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఎదురుగా ఉన్న వంత కాలువను రహదారిగా మార్చేందుకు ఆలయ కమిటీ రూ.3 లక్షల నిధులు వెచ్చించింది. భారీ ఎత్తున తూములు ఏర్పాటు చేశారు. ఇటీవల వర్షాలకు వరద తీవ్రతతో తూములు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో కూడా వరద రావడంతో గండి పడి ఆలయం ఎదుట పెద్ద గొయ్యి పడింది. ఆలయానికి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారు అవస్థలు పడుతున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే రహదారి మరింత కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై నూజివీడు ర.భ.శాఖ డీఈ సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, చాట్రాయి

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	స్వాగ్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దక్షిణ
ఆగిరిపల్లి: శ్రీకృష్ణ డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీవీ సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	స్వాగ్
శ్రీవెంకటరమణ సినిమాస్	దక్షిణ
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర